
# సమర

## కుప్పిలి పద్మ




'మార్వలెస్ అత్యంత వుత్సాహం, విస్మయం సమర చూపుల్లో... స్వరంలో.

యింతింత కళ్ళనిండా విస్మయం నింపుకుని ఆమె చూస్తున్న వైపు చూశాడు తపస్ ఆదుర్దా నిండిన చూపులతో, యెత్తైన పర్వత సానువుల్లో విరగబూసిన రంగు రంగుల పువ్వులు. పక్కనే జాలువారుతున్న జలధారపై సూర్యరశ్మికి వేలవేల రంగుల పరావర్తనం. వొక్క క్షణం ఆ సౌందర్యానికి మనసు చలించినా మరో క్షణం ఆమెపై చెప్పరాని కోపం వచ్చేసిందతనికి. "యేయ్. నీ కసలు మనం యెంత క్రైసిస్‌లో వున్నామో తెలుస్తుందా" అనడిగాడు తీవ్ర స్వరంతో.

ఆమె అటువైపు నుండి చూపులని అస్సలు తిప్పకుండానే 'అయ్యా! ఐ వాంట్ టు హగ్ దెమ్... పో ని నిన్ను' అంది పులకింతగా.

తపస్‌కి చిర్రెత్తుకొచ్చి 'ఆర్ యూ మ్యాడ్. నీ కసలు మనమెంత డేంజర్‌లో వున్నామో తెలుస్తుందా' అరిచాడు.

ఆమె నిదానంగా అతనివైపు చూసింది. వొక చిన్న రాయిని ఆనుకుని రెస్ట్‌లెస్‌గా కూర్చుని వున్నాడు. కొంచెం దూరంలో ఫ్యూయల్ అయిపోయి తామిద్దరూ అత్యంత అవసరంగా దిగిపోయిన హెలీకాప్టరు వుంది.

'నీకేమైనా అర్థమవుతుందా... నువ్వు అడిగిన మేఘాల దిక్కుగా నేను నడపటం యేంటి. దారికాని దారుల్లో ప్రయాణాలంటే నీకిష్టమని నాకేం తెలుసు. అప్పటికీ మా సర్ చాలాసార్లు చెప్పారు. అమ్మాయిలని యింప్రెస్ చేయాలని వున్నవాళ్లు అలాంటి ప్రయత్నం ఆకాశవీధిలో చేయొద్దని యిప్పుడెలా' అతను పానిక్‌గా అరిచాడు.

'యెందుకంత కంగారు. భూమ్మీదే వున్నాంగా' అందామె.

'అంటే యిప్పుడు కూడా' హెలీకాప్టర్ వైపు చూస్తు అన్నాడతను.

'వూ' అందామె.

ఆమెవైపు నిశ్చేష్టుడై చూశాడతను.

అతని చూపులు చుట్టూ చూశాయి. వో పక్కంతా పర్వతాలు పువ్వులతో మరోవైపు యెగుడు దిగుడు మైదానం. యీరెంటిని విడదీస్తూ మధ్యలో నేల కనిపించనంత లోతైన లోయ. కనుచూపు మేరలో యెక్కడా మానవ పరిమళమే లేదు.

'యిలాంటి చోట తామిద్దరు వున్నారని బయట ప్రపంచానికి యెలా తెలుస్తుంది. తమను రక్షించడానికి యెవరైనా వస్తారా. యీ సమర అమాయకులారా... తెలివి తక్కువదా... భూమ్మీదేగా వున్నాం అంటుంది. చీకటి పడేలోగా యెవరైనా రాకపోతే 'అతని సమస్త జీవితం భయంతో జలదరించింది.

ఆమె అతనికి చేరువగా వచ్చి పక్కన కూర్చుంటూ 'మనం సేఫ్‌గా భూమ్మీద దిగితే చాలనే అనుకొని వుంటాంగా యిందాక. యిప్పుడు యిక్కడ నుండి బయటపడడమెలాని ఆదుర్దా పడుతున్నాం. చుట్టూ చూడు. ఆ వైపు వెళ్లలేం. యేమో యిటు వెళ్ళితే యేదో వొక ఆదివాసి పల్లె కన్పించొచ్చు. కాని మనం యెటూ వెళ్లకుండా యిక్కడ వుండడమే మంచిది. మనల్ని వెతుక్కుంటూ రెస్క్యూ టీమ్ రావొచ్చు. మనం వాళ్ళకి మన క్రైసిస్‌ని చెప్పాం కదా. ప్రస్తుతం మనం వాళ్లకోసం నిరీక్షించడమే. వాళ్లు రాకపోతే పల్లెనో బయటికి వెళ్లే దారినో వెతకడమే' రిలాక్స్‌డ్‌గా అంది.

అతనికి కోపం తగ్గడం లేదు. యీ పరిస్థితికి కారణం ఆమె. యెంత తీరుబడిగా రిలాక్స్ అవ్వమని చెబుతుందో.

సమర అతనికి దగ్గరగా జరిగి భుజం మీద చెయ్యేసి 'తపస్ పరిస్థితులను తమకి అనువుగా యిష్టంగా మార్చుకోవటంలో అందముంది. అడివిలోకి వెళ్లి పండో, కాయో తీసుకురావచ్చు. రాత్రికి చలి వేయకుండా నీ జాకెట్‌ని నాకు త్యాగం చేయొచ్చు. రోకలిబండనో గొంగళిపురుగునో బొద్దింకనో చూసి భయపడి నే నిన్ను హగ్ చేసుకుంటే నువ్వు గొప్ప ధైర్యశాలిలా చూడు... యిది వుత్తి మిడతేనని నాకు ధైర్యం చెప్పొచ్చు. నన్ను నిద్ర పుచ్చడానికి జోలపాట పాడొచ్చు అంటున్న ఆమెని మధ్యలో కట్‌చేస్తూ 'నీకిదంతా నవ్వులాటగా వుందా' అన్నాడు తపస్.

'లేదు తపస్.... నన్ను యింప్రెస్ చేయటాని దేముడు నీకిచ్చిన రొమాంటిక్ అవకాశం అనుకో' అంటూ అతని బుగ్గపై ముద్దు పెట్టబోతుంటే అతను తిరస్కారంగా తల తిప్పేశాడు.

ఆమె నిరాశగా అతనివైపు వో క్షణం చూసి అక్కడ్నుంచి లేచి కాస్త దూరంగా వెళ్లి పూలవర్ణధార వైపు చూస్తూ కూర్చుంది. ఐదు నిమిషాలు గడిచాయి. ఆ క్షణాలే అతనికి చాలా రోజుల్లా తోచాయి. ఆమె వైపు చూశాడు. ఆమె పూలవర్ణధార వైపు చూస్తుంది. తనంత తాను వచ్చి యిప్పట్లో మాట్లాడే పరిస్థితి కనిపించలేదు. అతనే లేచి ఆమె దగ్గరికి వెళ్ళి పక్కన కూర్చున్నాడు.

'అలిగావా' అడిగాడు.

"వూ" అంది.

'వోకే'.... యిప్పుడు యిచ్చేయి' ఆమెకి కాస్త దగ్గరగా జరిగి బుగ్గను ఆమెకు చేరువగా వుంచాడు.

'ప్చ్... యివ్వను' చురుగ్గా కళ్ళు తిప్పుతూ చెప్పింది.

'యివ్వవూ... అలక మానవు.. యెలా' అడిగాడు చిన్నగా నవ్వుతూ.

'యెప్పుడంటే అప్పుడివ్వం. యిచ్చినప్పుడు

తీసేసు కోవాలి' పెంకిగా అంది.

'వో యస్.... మై డియర్ అంటూ తన చెవిని చేత్తో పట్టుకొంటూ 'సారీ నువ్వే యీ అలకకి పరిష్కారం చెప్పు' బ్రతిమాలాడు. చప్పున అతని బుగ్గని మునిపంటితో కొరికింది.

'బాప్‌రే.... యిక్కడినుండి యెలా బయట పడాలి. ప్రాక్టికల్‌గా చెప్పు' అడిగాడు.

'యెందుకంత కంగారు పడ తావ్. మనల్ని తీసుకెళ్ళే బాధ్యత వున్నవాళ్ళు వస్తారు. యీ వేళ కాకపోతే రేపు. వూరికే భయపడకు. అప్పటి వరకూ యీ ప్లేస్‌ని యెక్స్‌ప్లోర్ చేద్దాం' అంది సమర.

ఆమె మాట్లాడుతున్నప్పుడు ముఖ కదలికతో పాటు వూగుతోన్న ముత్యాలజూకాలని చూస్తూ 'నీకెప్పుడూ యే విషయాలలో భయం వేయదా' కుతూహలంగా అడిగాడు తపస్.

'వేస్తుంది'

'యేవంటే'

'ప్రేమంటే'

'ఫెయిల్యూర్ వుందా'

'నో... రిజెక్ట్'

'నిన్నా... నీలాంటి అందమైన అమ్మాయిని రిజెక్ట్ చేసేవాళ్లుంటారా' ఆశ్చర్యంగా అడిగాడు.

'జీవితంలో కలసి బతకడానికి అప్పటివరకు యిష్టపడినవి కాకుండా యింకా యింకా యేవేవో కావాలనిపిస్తాయనుకుంటా' అంది సమర.


అతను యేదో అనబోతు నోటిలోనే మాట లను ఆపేయటం చూసి 'యేంటి' అండిగిందామె'.

'వూ... మరేం లేదు. నీకు అభ్యంతరం లేకపోతే కాస్త వివరంగా చెప్పవా క్యూరియాసిటి అంతే తప్ప నీ పర్సనల్ విషయాలన్నీ, తెలుసు కోవాలని కాదు' అన్నాడు తపస్.

'మనం కలసి బతకాలని ప్రపోజ్ చేస్తున్నా వుగా. సరదాగా వింటావా. నీకో విషయం తెలుసా. నా దగ్గర కాలాన్ని వెనక్కి తిప్పే టైమ్ మిషన్ వుంది. దాన్నడుగు చెప్తుంది' అంది సమర.

'అయితే కాలాన్ని వెనక్కి తిప్పు' నవ్వుతూ అన్నాడు తపస్.

సమర డిగ్రీ చదివే రోజుల్లో ఆ కాలేజ్‌లో చదివే అందరికంటే అందంగా కనిపించేది. యింజనీరింగ్ చదువుతున్న అచల్‌కు యిద్దరి మధ్య స్నేహం యిష్టంగా మారడానికి యెంతో కాలం పట్టలేదు. తనవైపు బోల్డంత యిష్టాన్ని కళ్లనిండుగా నింపుకుని తను చెప్పే మాటలని యెంతో ఆసక్తిగా వినే ఆచలే ఆమె లోకం. యెప్పుడెప్పుడు అచల్‌ను




చూస్తానా.. మాట్లాడుతానా అనుకుంటూ ఆత్రంగా గోదారి వొడ్డుకు ఆమె వెళ్లేసరికి అచల్ ఆమె కోసం యెదురు చూస్తూండేవాడు.

'వొక్కసారైనా లేటుగా వచ్చి యింకా రాలేదేమిటా అని నే ఆదుర్దా పడుతుంటే సడన్‌గా వచ్చి సర్‌ప్రైజ్ చేయ్యచ్చు కదా' అందోసారి సమర.

అతను చిన్నగా నవ్వాడు.

అతను సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యాడు. ఐ.పి.యస్. వచ్చింది. అతను ట్రెనింగ్‌కి వెళ్లాడు. అప్పుడు ఆ బ్యాచ్‌లో అతనితో పాటు ట్రెనింగ్ అవుతున్న దీప్తికి అతను నచ్చాడు.

'దీప్తిని పెళ్లి చేసుకుంటావా' అని ఆమె తండ్రి నుంచి ప్రపోజల్ వచ్చింది. దీప్తి తండ్రి వున్నతస్థాయి పోలీసు అధికారి. అంత పెద్ద పొజిషన్‌లో వున్న వ్యక్తికి అల్లుడవ్వడం అంటే యిన్‌స్టెంట్ రికగ్నిషన్. అతను దీప్తిని పెళ్లి చేసుకోవడానికి తన ఆమోదాన్ని చెప్పేశాడు.

పెళ్లి పనులకని వూళ్లోకి వచ్చిన అచల్ తనొచ్చిన విషయం సమరకి తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. మొదటి శుభలేఖని దేముడు పాదాల ముందు వుంచాలని గుడికి వెళ్లిన అచల్‌కి సమర ప్రదక్షిణ చేస్తూ యెదురయ్యింది.

'అరె... యెప్పుడొచ్చావు.... చెప్పకుండా యింటికి వచ్చి సర్‌ప్రైజ్ చేద్దామనుకున్నావా. యింతలో నేను యెదురై నీకు సర్‌ప్రైజ్ యిచ్చేశా' మిలమిలలాడుతున్న చూపులతో అందామె.

ఆమెకి తన పెళ్లి విషయాన్ని సాధ్యమైనంత మామూలుగా చెప్పాలని ప్రిపేరై వున్న అచల్ 'భలే కన్పించావు. యీ గుడి నుంచి తిన్నగా మీ యింటికే వద్దామనుకుంటున్నా. నీకో సర్‌ప్రైజ్ న్యూస్ అన్నాడు.

'అవునా... వుండుండు. యింకొక్క ప్రదక్షిణ వుంది. పూర్తి చేసేస్తా' అంది సమర.

యిద్దరూ కోవెల వెనుక గోదావరి గట్టుపై కూర్చున్నారు. సాయంకాలపు కాంతితో ముచ్చటిస్తున్న గోదారి గాలులకి ఆమె ముత్యాల జూకాలు రిధమిక్‌గా వూగుతున్నాయి. ఆ రిధమ్ అంటే అతనికి చాలా యిష్టం. వాటినే చూస్తూ తన విషయం చెప్పాలని పదాలని పోగేసుకుంటున్నాడు. అతి మామూలుగా చెప్పేద్దాం అని యెన్నో సార్లు రిహార్సల్స్ చేసిన వాక్యాలన్నీ యెటో వెళ్లిపోయాయి. అతని గొంతు కేవో అడ్డు పడుతున్నాయి. ఆమె లేనప్పుడు చాలా తేలిగ్గా చెప్పేయొచ్చు అనుకున్న విషయం ఆమె సమక్షంలో చాలా కష్టంగా అనిపించింది. అంతలో పోస్ట్‌పోన్ చేయొద్దు. యీ వొక్క విషయం చెప్పేస్తే యే అడ్డంకులు లేని సూపర్ ఫ్యూచర్ తనదే.

'యేంటా సర్‌ప్రైజ్ న్యూస్' ఆసక్తిగా అడిగింది సమర.

'వూ.. నా పెళ్లి' చప్పున చెప్పేశాడు.

'నాకు తెలియకుండా నీ పెళ్ళేమిటి. యేదో చెప్పేస్తే నే నాశ్చర్యపోతాననుకున్నావా. అసలు విషయం చెప్పు' అతనికి చేరువగా జరిగి అంది సమర.

'నిజంగానే నా పెళ్లి. యిదిగో వెడ్డింగ్ కార్డు'

ఆమెకి అతను చెప్పేది అర్థమవ్వడానికి కొద్ది నిముషాలు పట్టింది. ఆమెకి భూమి అంతా తిరుగుతున్నట్లుగా అనిపించింది. కిందకి దొర్లిపోతా నేమోననిపించి అతనిని మరింత ఆనుకుపోయింది. తన చేతి వేళ్లతో అతని చేతిని గట్టిగా పట్టుకుంది. అలా యెంతసేపో వుండడం కాలేదు. అతడు కాస్త యెడంగా జరిగాడు. అతని చేతివేళ్లు త్వరగా వదులై పోయాయి.

యెలాగో నోరు పెగుల్చుకుంటూ 'యెందు కిలా చేశావు. యింట్లో వొత్తిడి చేశారా' అని అడిగింది.

'నువ్వెక్కువగా ఆలోచించి మనసు పాడు చేసుకోకు. నీ కెరియర్‌పై దృష్టి పెట్టు' అన్నాడు అచల్.

'అసలెందుకిలా జరిగింది' ఆమె కళ్లనిండా నీళ్లు.

'యిదిగో యిలా ప్రతిదానాకీ యేడవకు. యీ పరిగెత్తే ప్రపంచంలో నువ్వింకా మీ అమ్మమ్మ కాలంలో వున్నావు', అన్నాడతను.

'ఆ..... నన్ను యేమైనా అంటే అను. మా అమ్మమ్మనేం అనకు. ఆవిడ మనుషుల్ని యెంతగా ప్రేమిస్తుందో నీకు తెలుసు', రోషంగా అంది.

యీ మాటల వెల్లువ రోషాన్ని, చిలిపితనాన్ని తను నిస్సందేహంగా మిస్ అవుతాననిపించింది అచల్‌కి.

'మనిద్దరికీ వొకరంటే వొకరికిష్టం కదా', అందామె.

'అదొక్కటే సరిపోదు సమరా'

'మనిద్దరం జీవితాన్ని షేర్ చేసుకోటానికి వొకిరిపై వొకరికున్న యిష్టం సరిపోదా', అడిగింది సమర.

'యిష్టమా... వొక్కసారి ఆలోచించు. ట్రైనింగ్‌కి వెళ్లాక నేనెప్పుడైనా ఫోన్ చేశానా. యెసెమ్మెస్ పంపించానా. నే వేరే ఆలోచనలో వున్నాననే స్పృహే లేదు నీకు. లొడలొడా మాట్లాడటం తప్పు.'

'నువ్వెప్పుడైనా నీ కెరియర్ మీద దృష్టి పెట్టావా. అసలు క్యాంపస్ సెలక్షన్స్ అనేవి యెంత ముఖ్యమో ఆలోచించావా. యింజనీరింగ్ చదవ నన్నావు. నీ బి.యస్.సితో నువ్వేం చేస్తావు. నాతో సమానంగా కెరియర్‌పై ఆసక్తి వున్న అమ్మాయి తోటి జీవితం బాగుంటుందనిపించింది. నువ్విప్పుడు బాధపడొచ్చు. కాని నా మాటల్లో నిజం వుందని నువ్వెప్పుడైనా గ్రహిస్తావు. వొక మంచి ఫ్రెండ్‌గా చెబుతున్నా ఎం.బి.ఏ. చెయ్యి. కొన్నాళ్ళు జాబ్ చెయ్యి. వీలైతే బిజినెస్ స్కూల్ లాంటి స్కూల్‌కి వెళ్ళాలని పట్టుదలతో ప్రయత్నించు. నువ్విలా వుత్తి డిగ్రీతో ఉంటే నిన్నెవరూ యిష్టపడరు. నువ్వందంగానే వుంటావు. యీ రోజుల్లో అందంగా లేనివాళ్లెవరు. బైక్ నడపటం, ఫిట్‌గా వుండటం అసలన్ని విషయాల్లో అప్‌డేట్‌గా వుండాలి. యివన్నీ వుంటేనే ప్రేమనేది నిలబడుతుంది. దీప్తికూడా నన్ను యిష్టపడుతుంది. ప్రేమిస్తుంది. బట్ దీప్తి, సూపర్ వుమెన్. బోర్ కొట్టదు నీలా. తనకి చాలా విషయాలు తెలుసు కనక. చాలా విషయాలలో నిన్ను నువ్వు అప్‌డేట్ చేసుకో. అప్పుడే నువ్వు యెవరికైనా యింట్రస్టింగ్‌గా అనిపిస్తావు'. స్పష్టంగా చెప్పాడతను.

యిష్టపడిన యిద్దరు మనుషులు కలిసి బతకటానికి యిష్టమో, ప్రేమో సరిపోతుందనుకోవటం యెంతో అమాయకత్వమని సూపర్ వుమెన్ కావాలని అంటున్నాడు అచల్. యిప్పటికప్పుడు తనెలా అవ్వగలదు. అదెలా సాధ్యం. నిజమేనేమో, ప్రపంచపు పరుగుని తను సరిగ్గా గుర్తుపట్టలేదా. వొక్కసారి తన గూడును వదిలి కాస్త దూరంగా వెళ్ళగానే అచల్‌కి యెన్ని విషయాలు తెలిసాయి, అనుకుందామె.

ఆమె వొక్క నిముషం స్థబ్దురాలైనట్లు చూసిందతన్ని. 'నే వెళుతున్నా' లేవబోయాడతను.

ఆమెకి ఆ క్షణం అతను అక్కడినుండి వెళ్లిపోతే యింకా అతను తనకు పరాయివాడే ననిపించింది.

అతన్ని అల్లుకొని వొక్కసారిగా వెక్కి వెక్కి యేడవసాగింది. అతని ముఖంలో క్షణకాలం వుద్విగ్నమైన భావమొకటి మెరుపులా మెరసి మాయమయ్యింది.

తనని పెనవేసుకుని లుంగలు లుంగలుగా చుట్టుకుపోతున్నట్లు యేడుస్తున్న ఆమెని అలానే వదిలేసి అతను అక్కడ్నించి నిర్దాక్షిణ్యంగా బయలుదేరాడు.

తెంచుకునే వాళ్లు వెనక్కి చూస్తే భవిష్యత్తు వుండదని పూర్తిగా నమ్మి అతను వెనక్కి చూడకుండానే ముందుకు వెళ్లిపోయాడు.

ఫ్రూట్‌జ్యూసెస్, యెక్కువ చేస్తున్న వర్క్ అవుట్స్, ఫేషియల్స్‌తో అతను ముఖంలో పెళ్లికళని యింప్రూవ్ చేసుకునే కాలంలో – పాలిపోయిన చెక్కిళ్లు, దిగులు నిండిన కళ్లు, వుదాసీనమైన ముఖం, నిస్సత్తువగా, నిశ్శబ్దంగా తనలో తాను దుఃఖంతో మానసికంగా, శారీరకంగా కుంగిపోతున్న సమర.

అతను తన వుత్సాహాన్ని, విజయాన్ని అందరి దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నిస్తుంటే తన మానసిక పరిస్థితి బయటకు కనిపించకుండా వుండటానికి సమర శాయశక్తులా ప్రయత్నిస్తుంది. యేదైనా శక్తి తనని యీ మొత్తం నుంచి బయట పడేస్తే బాగుండునని ఆమెకు చాలా బలంగా అనిపిస్తుంది.

ఆ సమయంలో పెద్దమ్మగారి అబ్బాయి పెళ్ళి. అమ్మాయిది హైదరాబాద్. అక్కడే పెళ్ళి. అందరితో పెళ్లికి వెళ్లింది. వోరోజు సిటీ చూడడానికి పెళ్లికొచ్చిన చాలామంది బయలుదేరారు.

ఆ సాయంత్రం నెక్లెస్ రోడ్డులోని వాటర్ ఫ్రంట్ రెస్టారెంట్‌లో లేలేత వెలుగులో వాళ్లంతా సందడి సందడిగా మాట్లాడుకుంటున్నారు. సాగర్ నీళ్ళ మధ్య ప్రశాంతబుద్ధుడు, దూరంగా ట్యాంక్ బండ్‌పై అటు యిటూ సాగుతున్న వాహన దీపాలు. 'శాంతి లేదు... చిరు వెలుగు లేదు. యెప్పుడు వెన్నంటివుండే యీ బాధేంటో' ఆలోచిస్తూ, సమర రెస్టారెంట్‌లోంచి బయటకు వచ్చింది. మెల్లగా బాట వెంట నడుస్తోంది.

కెవ్వుకెవ్వున కేరింతలు. చప్పట్లు. ఈలలు. ఆ సందడి వైపు చూసింది.

బంగీ జంప్ !

అటువెళ్లి యింపల్సివ్‌గా లైనులో నిల్చుంది. బి.పి.చెక్ చేశారు. బంగీజంప్.... ఆకాశానికి, భూమికి మధ్య శరీరం గాలిలో వేలాడుతుంటే గుండెల్లోని బరువేదో కరుగుతున్న ఫీలింగ్ సమరకి.

ఆ రాత్రి ఆమెకి పదే పదే పైనుంచి కిందకి దూకుతున్నట్లు, పర్వతాలు యెక్కేస్తున్నట్లు, సముద్రాలు యీదేస్తున్నట్లు యేవోవో కలలు. తిరిగి మర్నాడు సాయంకాలం నెక్లెస్ రోడ్డుకు వెళ్లింది. తిరిగి బంగీజంప్. ఆమెకి మళ్ళీ, మళ్ళీ జంప్ చేయాలని పించింది.

తరువాత రోజు హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణం.

ఆ రాత్రంతా యేదో మిస్సింగ్ ఫీలింగ్.

గోదారొడ్డున కూర్చుంది. పిల్లలు యీత



తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ వారి సభలో సత్కారం పొందిన ప్రముఖ వాగ్గేయకారులు డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు; శ్రీ టి.ఆర్. అడబాల: చిత్రంలో తంగిరాల చక్రవర్తి, ఎస్.ప్రసాదరావు, కళాప్రపూర్ణ డా॥పోతుకూచి సాంబశివరావు, జి. అప్పారావు ఉన్నారు.

కొడుతున్నారు. తను యీత కొడితే... యెప్పుడు జామ చెట్టయినా యెక్కని తను బంగీ జంప్ చేసేసింది. యిప్పుడేమో యీత కొట్టాలనిపిస్తోంది.

కార్తీక స్నానాలప్పుడు, పోయినసారి పుష్కరాలప్పుడు మూడు మునుగుల స్నానం యింట్లో వాళ్లతో కలిసి.

మెల్లగా నది వొడ్డునున్న నీళ్లల్లో పాదాల్నాంచింది. పిల్లలు సరదాగా కేరింతలు కొడుతూ దగ్గరికి వచ్చారు. పాదాల కిందనుంచి పారుతోన్న నీరు. కాసేపు నీళ్లల్లో నిలబడటం ప్రాక్టీస్ చేసి యింటికి బయలు దేరింది. యెప్పుడూ లేంది గాల్లో తేలాలని, నీళ్లల్లో ప్రవహించాలని, కొండలెక్కాలని మనసెందుకు ఆరాటపడుతోంది. తనకేమవుతోంది. జీవనమే అనుకున్న ప్రేమ నుంచి దొర్లిపోయాయి. నన్ను యిల్లాంటివేవి భయపెట్టడం లేదు. రోజు రోజుకీ పెరిగిపోతున్న రెస్ట్‌లెస్‌నెస్. యేదో చెయ్యాలి. లోపల్నుంచి పేరుకొంటోన్న వేలవేల కణాల శక్తి బయటికి వస్తానంటుంది.

ఆరోజు రాత్రి ఆమె టి.వి. చూస్తోంది.

కరేబియన్ సముద్రపు ఆకుపచ్చ అలల లేతనీలి కెరటాలు. వొడ్డున సేదతీర్తున్న టూరిస్ట్‌లు, యీత కొడుతున్న వాళ్లు, ఆడుకుంటున్నవాళ్లు అందర్నీ కంటికి రెప్పల్లా కాపు కాస్తున్న వాళ్లు.

రా రమ్మని వుత్సాహపరుస్తోన్న కొబ్బరాకు పచ్చ సముద్రం.

ఆమెలో మెరిసిన ఆలోచన.

కోస్టల్ గార్డ్.... యస్... వెంటనే వివరాలు సేకరించింది.

72 వారాలు ట్రెనింగ్‌కి చెన్నైకి వెళ్లింది. తన శరీరం సముద్రపు అలలకో, కెరటాలకో యెదురెల్లుతుంటే ఛాలెంజ్‌గా అనిపిస్తుండేది. నిరంతరం సాహసాల అన్వేషణ క్రైసిస్ మేనేజ్‌మెంట్ యం.బి.ఏ. చేసింది. రోడ్డుమీద టూ వీలర్ నడపటానికి భయపడే సమర యిప్పుడు ఫ్లయింగ్‌క్లబ్ మెంబర్.

సమయం గతంనుంచి వర్తమానంలోకి వచ్చింది.

'వెరీ యింట్రెస్టింగ్. క్రైసిస్ మేనేజ్‌మెంట్ యెక్స్‌పర్ట్ సమరకి వొకప్పుడు టూ వీలర్ నడపటం రాదంటే యెవ్వరూ నమ్మరేమో', అన్నాడు తపస్. చిన్నగా నవ్వుతూ అతని క్రాఫ్‌ని చెరిపేస్తూ, 'యేం లాభం, నువ్వు నన్ను నమ్మకుండా యిందాక భయపడ్డావ్‌గా', అంది కొంటెగా.

'ఆమధ్య సముద్రపు దొంగలు షిప్‌ని హైజాక్ చేయబోతుంటే మెరుపులా పనిచేశావని విన్నప్పుడు నీ తీగలాంటి శరీరానికియింత శక్తి యేంటానను కున్నా.... అవును ఆ తర్వాతెప్పుడూ అచల్ కనిపించ లేదా,' అనడిగాడు.

'కన్పించాడు', అందామె.

'నువ్వు చాలా యెదిగావని అన్నాడా.'

సమర చూపులు యెదురుగా వున్న పర్వతాలపై.

'యేమన్నాడు', తిరిగి అడిగాడు.

సమర ఆలోచిస్తూ, 'ఆ రోజేం అయిందో కాలాన్ని వోసారి వెనక్కి తిప్పి అడుగు. నాక్కూడా వినాలనే వుంది', అంది.

ఆరోజు ఫ్లయిట్‌లో అచల్, దీప్తి, వాళ్లిద్దరి పిల్లలు.

అచల్ అప్పటికంటే మాస్లీగా వున్నాడు. పసిమిఛాయ మెరుస్తోన్న బుగ్గలు గుండ్రని కళ్లు మష్రూమ్ హెయిర్‌కట్‌తో తీరైన ఆకృతితో అందంగా గ్రేస్‌ఫుల్‌గా వుంది.

యీ రోజుల్లో అందంగా లేనివాళ్ళు యెవరు. ఆనాటి అచల్ మాటలన్నీ సమరలో రివైండ్ అవుతున్నాయి. యెంతగా యిష్టపడింది. అతని సమక్షంలో అతని చేతి వేళ్లనో, జుట్టునో చెంపలనో యెప్పుడూ స్పర్శిస్తూనే వుండేది. రవ్వంత మోహం నిరంతరం. బోల్డంత ప్రేమ జీవితమంతా అతనితో నిత్య సంగీతవాహినిలా ప్రవహించాలనుకొంది. కాని.. కాని అతనేం చేశాడు. చాలా నిర్దాక్షిణ్యంగా నిర్లిప్తంగా 'నీకేం రాదు పో.... నువ్వో సూపర్ వుమెన్‌వి కాదు', అని దుఃఖానికి వదిలేసి హుందాగా తనకి నచ్చే సూపర్ వుమెన్ వైపు వెళ్లిపోయాడు. సమర తన చెవికున్న ముత్యాల జూకాని ఆత్మీయంగా తడిమింది. యివి అతనిచ్చినవే... అచల్‌ని చూడటానికి వురకలెత్తే మనసు యిన్నేళ్ల తర్వాత కనిపిస్తే నడక మాట మర్చిపోయి నట్టు యిలా అచేతనం అవ్వటం ఆమెని బాధిస్తోంది.

లేత పింక్ కలర్ షర్ట్ చెవికి ముత్యాల జూకాలు... తనిచ్చినవని గుర్తొచ్చి 'వోగాడ్... సమరా యేం మార్లేదు. యింకా సెంటిమెంటల్ ఫూల్లానే వుంది. లేకపోతే యింకా వాటినే మోసుకు తిరగటం యేంటి. తను తీసుకున్నది సరియైన నిర్ణయమే. సమరతో కలిసి ప్రయాణించాలని నిర్ణయించుకొని వుంటే తన జీవితం బల్లిలా వుండేది,' అనుకున్నాడు అచల్.

పిల్లలు పోటీపడి అచల్‌వైపు వంగి యేవేవో చెప్పేస్తున్నారు. వాళ్ల మాటలకి దీప్తి, అచల్ నవ్వుతున్నారు. వాళ్లు తుళ్లింతగా నవ్వుతుంటే వెరి వెరి హ్యాపీ ఫ్యామిలీలా చూడముచ్చటగా వుంది సమరకి.

తనవైపు చూసినప్పుడు అతను కనీసం పలకరింపుగానైనా నవ్వకపోవటం సమరకి బాధేస్తుంది. తనేం చేసింది. యెందుకిలా అపరిచితంగా వున్నాడు. ఆమె కళ్లు చెమర్చాయి.

తన మనసింకా చెమ్మగిల్లుతోందే అనుకొంది. హృదయంలో బాధావీచికలు మెల్లమెల్లగా సమాయత్తమవుతున్నాయి.

హఠాత్తుగా వో కలవరపు ప్రకటన.

యెమర్జెన్సీ ల్యాండింగ్...

నిశ్శబ్దం. కలవరం. హాహాకారాలు, ఫ్లయిటంతా.

ప్రయాణీకుల సేఫ్టీకోసం ల్యాండింగ్‌లో యెలా వుండాలో చెపుతున్నారు.

సమర సమస్తశరీరము అలర్ట్ అయింది.

ఆమె అచల్‌వైపు చూసింది. చుట్టూ చూసింది. భయం. భయంకరమైన భయం అందర్లో. అచల్ తన యెనిమిదేళ్ళ కొడుకు. భుజాల చుట్టూ చేతులేసి నిస్సహాయంగా, దీప్తి పాపపై చేతులాన్చి కూర్చుంది నిశ్చేష్టురాలై.

ఫ్లయిట్ మెల్లమెల్లగా కిందకి దిగుతోంది.

సమర బయటకి చూసింది.

సముద్రం.

సముద్రంలోనా లేక దగ్గరలో వున్న నేలపై లాండ్ అవుతుందా చెప్పలేక ఫ్లయిట్ సేఫ్ ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తున్నామని చెపుతున్నారు.

యేం జరుగుతుందో తెలియని ఆ క్షణంలో కూడా తమ ప్రయాణీకులకి ధైర్యాన్ని ఆశని


**సినీతారల ఫోటోలు**

ఈ క్రింది అడ్రస్‌కు రూ.20/-లు ఎం.ఓ చేయండి. వెంటనే మీ అభిమాన సినీతార కలర్ కార్డుసైజు ఫోటోతో పాటు మిమ్మునవ్వించే జోకుల పుస్తకం కూడా పొందండి.

వై.కె.మూర్తి
దాసరివారి వీధి, సూర్యారావుపేట
విజయవాడ - 520 002

యివ్వటానికి తమ శాయశక్తుల సిబ్బంది కృషి చేస్తున్నారు.

సమర తన చుట్టూ వున్న ప్రయాణీకులకి ధైర్యం చెపుతోంది.

ఫ్లయిట్ చాలా చాలా కిందకి వచ్చేస్తోంది. చివరికి దేముళ్ల ప్రార్థనలలో హాహాకారాల నడుమ ఘనీభవించిన నిశ్శబ్దం మధ్యా విమానం తీరం అంచున సగం నీళ్లల్లో సగం భూమిపై నిల్చింది. ప్రయాణీకుల్ని నీళ్లలోంచి వొడ్డుకి చేరవేయటానికి సమర తన సర్వీస్‌ని ఆఫర్ చేసింది.

తామున్నది నేలకి చేరువగా అని తెలియగానే ప్రయాణీకులు ఆనందంతో మూగపోయారు. కేకలేసారు. కేరింతలు, దేముడికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే మొక్కులు తీర్చుకోవాలనుకున్నారు. నవ్వారు. కళ్లనీళ్లతో యేడ్చారు.

ఫ్లయిట్‌లోంచి అంతా దిగారని నిర్ధారించుకొన్నాక పైలెట్ ఫ్లయిట్ దిగాడు. సమరకి థ్యాంక్స్ చెప్పాడు.

అదో అందమైన టూరిస్టు ద్వీపం. భూమిని ముద్దాడుతున్న ప్రయాణీకులు. పృథ్వి చాలా అందమైనది అనుకొంటూ సమర. 'మనుష్యులకి యెంతో ఆశని యిస్తుంది కదా,' ఆలోచిస్తూ సమర యిసుకలో నడుస్తూ కాటేజెస్ వైపు వెళుతోంది.

అరుపులు, చాలా పెద్దపెద్దగా.

ఆమె వెనక్కి చూసింది.

సముద్రం వైపు చూస్తూ అచల్, దీప్తి సమస్త ప్రపంచం మునిగిపోతున్నట్టు అరుస్తున్నారు. మరికొందరు కేకలేస్తున్నారు.

సమర సముద్రంవైపు చూసింది.

ఆమె సూదంటి చూపు ప్రమాదాన్ని పసిగట్టింది. అంతే రివ్వురివ్వున వాయుబాణంలా సముద్రంలోకి దూసుకుపోయింది.

అంతా వూపిరి బిగపెట్టి చూస్తున్నారు. అచల్‌కి దీప్తికి తమ ప్రాణాలని యెవరో లాగేసుకున్నట్టు గడ్డ కట్టుకుపోతున్నట్టు. క్షణమొక యుగంలా గడుస్తుంది. సముద్రానికి యెదురెల్లి వో ప్రాణాన్ని రక్షించటానికి తన శక్తికి మించి పోరాడి సమర ఆ యెనిమిదేళ్ల బాబుతో బయటికి వచ్చింది.

విమాన ల్యాండింగ్ సమయంలో వచ్చిన అంబులెన్స్ అక్కడే వుంది. సమర బాబు మింగిన నీళ్లని బయటికి రానిచ్చింది. డాక్టర్స్ ఫస్టెయిడ్ చేస్తున్నారు.

ఫ్లయిట్ నుంచి బయటికి వచ్చినవాడు అలలతో ఆడుతూ వున్నాడు. యింతలో పెద్దకెరటం లోపలికి లాగేసింది. లక్కీ... సేవ్ అయ్యాడు. యింపాజిబుల్ అనుకున్నా. అసలా సముద్రం చూడు ఫుల్‌మూన్ టైమ్ కదా రెచ్చిపోతోంది. భలే రక్షించింది. యెంత సాహసం....' యిలా అనేకానేక అభిప్రాయాలు, ప్రశంసలు.

పైలెట్ సమర దగ్గరికి వచ్చి సంతోషంతో మెచ్చుకున్నట్లుగా ఆలింగనం చేసుకున్నాడు.

దీప్తి ఆదుర్దాగా బాబుకి యిస్తున్న ట్రీట్‌మెంట్ వైపు చూస్తోంది. యీ మొత్తానికి దిమ్మెరపోయినట్టు అయాడు అచల్. బాబు కాస్త తేరుకొని కొంచెం తేటగా చూశాడు. డాక్టర్ భయమేం లేదని చెప్పారు. సమర కాటేజెస్ వైపు బయలుదేరింది.

హఠాత్తుగా అచల్ ఆమెవైపు పరుగెత్తి ఆమెని అల్లుకుపోయిన వెక్కెక్కి యేడవసాగాడు. తన చుట్టూ వున్నవాళ్లు దీప్తి చూస్తుందన్న స్పృహే లేదతనికి. వో పక్క సువిశాల సముద్రం మరోవైపు భూమి. అతను కన్నీటి సముద్రమయ్యాడు. కృతజ్ఞతాశిఖరమైనాడు. కొన్నేళ్ళ క్రితం పక్కటెముకలు కదిలిపోతూ తనని అల్లుకుపోయిన అమాయకమైన తనువు గుర్తొచ్చింది. కొన్నేళ్లక్రితం నిర్దాక్షిణ్యంగా వదిలిపోవటం మెదిలింది. తనని అల్లుకుపోయిన అమాయకమైన తనువు కాదని అతనికి నిదానంగా అవగతం కాసాగింది. ఆరోజు తనని వోదార్చే ఒక్క భుజం కోసం ఆమె తల్లడిల్లింది. యిప్పుడామె వేలవేల భుజాలుగా కల్లోల సమయాలలో ప్రాణాలు నిలిపి వేలవేల భుజాలుగా ధీరోదాత్తంగా ప్రేమ సముద్రంగా... సమర క్షమించు. నీ జీవితానందాన్ని అవలీలగా తోసేసి వెళ్లిన నాకు నా కుటుంబాన్ని నువ్వు ప్రసాదించిన ప్రాణానందం సమరా... అతను వెక్కుతున్నాడు. పెదవుల్లో వొక్క పదం రావటం లేదు. మనసు మాటల జలపాతమైంది.

ఆమె మెల్లగా అతని భుజాన్ని తట్టి అతన్నుంచి ముందుకు కదిలింది.

దీప్తి కన్నార్పకుండా చూస్తోంది.

ఆమె మనసంతా కృతజ్ఞత.

ఆరాత్రి ఆ ద్వీపంలో అందరికి బస యేర్పాటు చేసారు. పిల్లలూ యింకా షాక్‌లోనే వున్నారు. దీప్తి బాబు దగ్గర కూర్చుంది. అచల్‌కి వొక్కసారి సమర దగ్గరికి వెళ్లాలనిపించింది. అతను ఆమెను వెతుక్కుంటూ బయలుదేరాడు.

సమర సముద్రం ముందు నిలబడి వుంది. వెన్నెల్లో మిలమిలలాడుతోన్న వొత్తైన సాగరం.

'సమరా' ఆమెకి కాస్త వెనగ్గా ఆగి పిలిచాడు.

ఆమె వెనక్కి చూసింది.

యిరువురు అభిముఖంగా.

'మా యిద్దరం మాకు చాలా చాలా తెలుసనుకుంటాం. మా చుట్టూ వాళ్ళు నమ్ముతారు. సమస్తం తల్లకిందులైనప్పుడు మా జ్ఞానం, పవర్, సంపద యేది పనికిరాలేదు. నిస్సహాయంగా నిలబడ్డాం. యెందుకు పనికి రావనుకున్న నువ్వే మా జీవితానందాన్ని దూరం కాకుండా కాపాడావే. ఆ రోజుల్లో ప్రేమ యిష్టం కంటే విలువైనవి ఆనందాన్నిచ్చేవి చాలా వున్నాయని కొత్తగా వీస్తున్న గాలుల వైపు పూర్తిగా తమని తాము మార్చుకొని ప్రయాణించిన వాళ్లలో నేనూ వొకణ్ణి. యిప్పుడే కాస్త యేదో అర్ధం అవుతోంది. బట్... వెరీ హ్యాపీ. నువ్వు సూపర్ వుమెన్‌వి అయ్యావ్' అన్నాడతను.

సమర చిన్నగా నవ్వి, 'ఆ సమయంలో అక్కడ నాలోని వో స్కిల్ పనికొచ్చింది. మరో సందర్భంలో మరొకరిది. యింకేదో పనికొస్తుంది. సూపర్ పవర్, సూపర్‌నేషన్. సూపర్... యేవైనా కావొచ్చు. అదో మిత్ అనిపిస్తుంది. చాలాసార్లు రుజువైంది కూడా. వీటిముందు మనం మనం శక్తి సామర్థ్యాలెంత' చూపుల్ని భూమి ఆకాశం సముద్రం వైపు చకచకా తిప్పుతూ అంది సమర.

'బాబు పడుకున్నాడా', అడిగిందామె.

'యింకా లేదు. భయపడినట్టున్నాడు'.

'ఆ భయం ముందు ముందు కంటిన్యూ అవుతుందనిపిస్తే లాబీలో వో సైక్రియాట్రిస్ట్ నెంబర్, యీ మెయిల్ ఐడి యిస్తా చూపించండి', అంది సమర.

'థ్యాంక్ యూ', అన్నాడు అచల్.

అతని కళ్లల్లోకి వోసారి తదేకంగా చూసి ఆమె తన కాటేజ్‌వైపు బయలుదేరింది.

సమర వెళ్ళిపోతున్నవైపు దిగులుగా చూస్తూ అతను తన కాటేజికి వెళ్లాడు.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు.

దీప్తి చాలా తక్కువ వాల్యూమ్‌తో టి.వి. న్యూస్ చూస్తోంది.

188 యేళ్ళ చరిత్ర ఉన్న లేమన్ బ్రదర్స్ బ్యాంక్ దివాళా తీసింది. దీనివలన ప్రపంచంలో కెల్లా సూపర్ పవర్ అయిన అమెరికా కనివినీ యెరుగని సంక్షోభంలో నెట్టబడవచ్చు అని న్యూస్ రీడర్ చెపుతోంది... విశ్లేషణ సాగుతోంది.

తిరిగి టైంమిషన్ వర్తమానానికి వచ్చేసింది.

'వో గాడ్... సూపర్ ట్విస్ట్,' అన్నాడు తపస్.

'అదిగో మనిద్దర్ని రెస్క్యూ చేయటానికి వస్తున్నారు. నీకు నన్ను యింప్రెస్ చేసే అవకాశం యీ రోజుకి పోయింది,' అంది సమర.

ఆమె బుగ్గపై ముద్దు పెడుతూ, 'యిది చాలదా నిన్ను యింప్రెస్ చేయడానికి,' అడిగాడు.

'యిది కాదు కానీ...' ఆగిందామె.

'మరి', ఆత్రంగా అడిగాడు.

హెలికాప్టర్ హోరు దగ్గరవుతోంది.

'ముద్దు పెడుతున్నప్పుడు నన్ను టచ్ చేసే నీ వూపిరి చాలా బాగుంటుంది,' నవ్వుతూ అందామె.